## క్లుప్తంగా

### స్వచ్ఛతకు ముగ్గులే రక్ష



రాఘవేంద్ర కాలనీలో చెత్త స్థలంలో ముగ్గులు వేస్తున్న శానిటేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. కవర్లలో చెత్తను మూటలు కట్టి నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. దీంతో కాలనీల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. రెండు రోజులకోసారి చెత్త ట్రాలీ, ఆటోలు, వ్యాన్లు వస్తున్నప్పటికీ బాధ్యతగా అందులో వేయకుండా నడిరోడ్డు పక్కన విసిరివేస్తున్నారు. పలు కాలనీవాసుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ అధికారులు కదిలారు. సిబ్బంది సాయంతో చెత్తను వేస్తున్న చోట స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా శుభ్రం చేసి కల్లాపు చల్లి ముగ్గులు వేసి చెత్తను వేయవద్దంటున్నారు. అందులో భాగంగానే బడంగ్‌పేటలోని రాఘవేంద్ర కాలనీలో చెత్త వేయకుండా సోమవారం ముగ్గులు వేసి స్వచ్ఛతకు సహకరించాలని శానిటేషన్ సిబ్బంది ప్రజలను కోరారు.

### పేదలకు పట్టాలివ్వాలి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని 221 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకుడు బి.పురుషోత్తం కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మాజీ సర్పంచ్ కట్టెల రాములు ఈ స్థలంలో పేదలకు పట్టాలు ఇవ్వాలని 150 మంది పేదలతో దరఖాస్తు చేయించారన్నారు. కానీ, ఇటీవల కొందరు ఈ భూమి నవాబులదని పేర్కొంటూ అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దళారుల నుంచి భూమిని కాపాడి సమగ్ర సర్వే చేసి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

### 19న తైబజార్ వేలం

కందుకూరు: కందుకూరు చౌరస్తాలో ప్రతి ఆదివారం నిర్వహించే తైబజార్(వారాంతపు సంత)కు 2024–25 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 19న గ్రామ ప్రత్యేకాధికారిణి బి.సరిత ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉ.10.30 గంటలకు నిర్వహించనున్న వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10 వేలు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వేలం దక్కించుకున్న వారు మూడురోజుల్లో 50 శాతం నగదు చెల్లించాలని, మిగతా 50 శాతం డిసెంబర్ నెలాఖరు వరకు చెల్లించేలా ఒకరి షూరిటీతో అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. చెల్లించని పక్షంలో రెండో వేలం పాటదారునికి అప్పగించాల్సి వస్తుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

### ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోండి



యంజాల జనార్దన్

పహాడీషరీఫ్: బోనాల పండుగ చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే సబితారెడ్డిని అవమానించడం సహించరానిదని బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు యంజాల జనార్దన్ మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దేశంలోనే తొలి హోంమంత్రిగా పని చేయడంతో పాటు ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా సేవలందించిన సబితారెడ్డికి కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ స్టేజ్ పైన, ప్రజా ఆశీర్వాదంతో గెలిచిన సబితమ్మ స్టేజ్ కింద కూర్చొనేలా చేయడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని ప్రమాణస్వీకారం చేసిన రాహుల్‌గాంధీ, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ విధానాలను అందుకు భిన్నంగా అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అంగన్‌వాడీలో 'అమ్మపాట'

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ భగత్ సింగ్‌నగర్ ఫేజ్–2 అంగన్‌వాడీ–3 కేంద్రంలో 'అమ్మ పాట– అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఆట, పాటలతో పాటు చదువులు నేర్పించడం జరుగుతుందని వార్డు కమిటీ సభ్యుడు ఎండి.జహీర్ తెలిపారు. రెండున్నర సంవత్సరాలు పూర్తయిన పిల్లలకు ఆహ్లాదకర వాతావరణంలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బస్తీలోని తల్లిదండ్రులు రెండున్నరేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఆయన కోరారు.

### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు ఇలా.. టమాట రూ. 57, వంకాయ రూ. 23, బెండ రూ. 28, పచ్చిమిర్చి రూ. 60, కాకర రూ. 45, బీర రూ. 28, క్యాబేజీ రూ. 38, ఫ్రెంచి బీన్స్ రూ. 70, క్యారెట్ రూ. 35, దొండ రూ. 35, చిక్కుడు రూ. 85, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 23, క్యాప్సికం రూ. 67, ఆలు రూ.

# వర్షాకాలం.. కావాలి అప్రమత్తం

**పశువుల్లో రోగాలు వచ్చే అవకాశం**

- వ్యాధి లక్షణాలు గుర్తించి వైద్యుడిని సంప్రదించాలి
- పశువుల పాక, పశువులను శుభ్రంగా ఉంచాలి
- టీకాలు వేయించడం మర్చిపోవద్దు
- విశ్వేశ్వర్, దుబ్బచర్ల పశువైద్యాధికారి





పశువుల పాకలో ఉన్న గేదెలు

మహేశ్వరం: నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు పశుసంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. ఎన్ని ఇబ్బందులొచ్చినా పాడి పరిశ్రమనే నమ్ముకుని బతుకుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని.. వాటిని సంరక్షించుకుంటేనే ఆదాయమని దుబ్బచర్ల పశువైద్యాధికారి డా. విశ్వేశ్వర్ పేర్కొన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**గొంతువాపు వ్యాధి..**

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతువాపు వ్యాధి.దీనినే గురకవ్యాధి అంటారు. సూక్ష్మజీవుల వల్ల పశువులకు సంక్రమిస్తుంది. ఇది అంటు వ్యాధి, ఇతర పశువులకు సోకుతోంది. కలుషితమైన నీరు, మేత ద్వారా రోగ నిరోధకశక్తి తగ్గి వ్యాధి బారిన పడతాయి. కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగా కారుతూ, గురక శ్వాస పీల్చడం కష్టమవుతుంది. గుర్రుమని శబ్దం వస్తుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతుకిందకు నీరుదిగి గొంతువాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన పశువు 24 గంటల్లో మరణిస్తుంది.

**నివారణ..**

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో వ్యాధి నిరోధక టీకాలు చేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటాసెఫ్‌టాజు, ఎక్సెప్టై వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. సమీప పశువుల వైద్యాధికారిని సంప్రదించాలి.

**గాలికుంటు వ్యాధి, నుంజు జ్వరం**

కలుషితనీరు, గాలి ద్వారా గాలికుంటు వ్యాధి, నుంజు జర్వం వస్తుంది. తల్లిపాలు ద్వారా దూడలకు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షకాలంలో గేదె, ఎద్దు, ఆవులకు వచ్చే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. గిట్టలు ఉన్న ప్రతి జీవికి ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల జర్వం ఉంటుంది. నోటిలో గిట్టల మధ్య పుండ్లు పుట్టి పశువులు నడవలేని స్థితికి చేరతాయి. వర్షాలు ఎక్కువగా ఉండి చలి పెడుతున్నప్పుడు ఈ వ్యాధి విజృంభిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు నోటి, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం చేత పశువులు మేత తీసుకోలేక నీరసించి పోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల చూడి గేదెలు ఈసుకుపోతాయి. పాడి గేదెలకు పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఈ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తుంది. ఈ టీకాలు వల్ల పశువులు రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటాయి.

**చికిత్స..**

వ్యాధి సోకిన పశువును మంద నుంచి వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ ఫౌడర్ గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేప నూనె రాయాలి. యాంటిబయెటిక్స్, పెయిన్ కిల్లర్స్ వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ట్రెపెన్ 2.5గా, ఎన్‌రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్, సెఫ్‌ట్రిక్స్ 3 గ్రాములు, మెలోనెక్స్ 30 ఎంఎల్, నిమోవెట్ 50 ఎంఎల్ వాడితే పశువులు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయి.

**జబ్బవాపు వ్యాధి...**

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చొవై బాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఆరు నెలల నుంచి రెండేళ్లలోపు వయస్సున్న పశువులకు ఎక్కువగా వస్తుంది. ఈ వయస్సులో పశువులకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండరాలను ఆశించి ఆ కండలు కుళ్లిపోయేలా చేస్తుంది. వాపుతో పశువులు కుంటుతాయి. వెనుక కాలు కాని ముందు కాలుగాని పైకి లేపి ఉంచి కుంటడం చేస్తాయి.

**వ్యాధిగ్రస్త పశువుల్ని వేరు చేయాలి**

వ్యాధి ప్రారంభంలోనే పెన్సిలిన్ వంటి యాంటిబయాటిక్స్ వాడాలి. వ్యాధిగ్రస్త పశువుల్ని వేరుచేయాలి. వ్యాధితో చనిపోయిన పశువులను గుంతతీసి పూడ్చిపెట్టాలి. వ్యాధి రాకుండా వర్షాకాలం ముందే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

# సమస్యలు పరిష్కరించాలని దీక్షలు

కందుకూరు: పెండింగ్ బిల్లులు, జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు, పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదన్నారు. కోడి గుడ్డు బిల్లులు ఆరు నెలలుగా బకాయి ఉన్నాయన్నారు. కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.10 వేలు ఇస్తామన్నారన్నారు. ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి జీఓలు విడుదల చేయలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కల్యాణ్‌కార్ శ్రీనివాస్, కార్యదర్శి ప్రభావతి, ఆ సంఘం నాయకులు కిషన్‌జీ, లలిత, మంగ, భాగ్యలక్ష్మి, అలివేలు, శారద, శంకరమ్మ, అశ్విని, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# జీఓ 10ని రద్దు చేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్) ఎదుట జీఓ నంబర్ 10కి వ్యతిరేకంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు తీవ్ర అన్యాయం చేసేవిధంగా జీఓ నంబర్ 10ని తీసుకొచ్చిందని ఆరోపించారు. వెంటనే రద్దు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష మాత్రమే ఇస్తుందన్నారు. సగం జీతం ఇచ్చే విధంగా కొత్త జీఓను జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించి నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని ఆయన కోరారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యాలయంలో లేకపోవడంతో ఇబ్రహీంపట్నం సీడీపీఓ శాంతిశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బాలమణి, వైదేహి, సీఐటీయూ నేతలు కిషన్, ఎల్లేష్, కృష్ణ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డిని కలిసిన మాధవరెడ్డి, రైతులు

# భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

మహేశ్వరం: ఫ్యాబ్(ఈ–సిటీ)లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డిని టీపీసీసీ కార్యదర్శి బోధ మాధవరెడ్డి, రావిర్యాల రైతులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు. గత 18 సంవత్సరాల నుంచి ఫ్యాబ్ సిటీలో భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ప్రభుత్వం ఫ్యాబ్‌సిటీలో భూములు కోల్పోయిన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని ఆమెను కోరారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి లష్కర్ గూడలో మహేశ్వరంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తానని అనడంపై కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. అంతకు ముందు ఫ్యాబ్‌సిటీలో భూములు కోల్పోయిన రైతుల వివరాలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో రావిర్యాల ఫ్యాబ్‌సిటీకి వచ్చి భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆమెను కలిసిన వారిలో రైతులు చింతల అనంతరెడ్డి, బోధ రఘుమారెడ్డి తదితరులు ఉన్నారు.

# పీర్ల చావిడిలకు మరమ్మతులు చేయండి

**ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరిన మైనార్టీ నేతలు**



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

మహేశ్వరం: మండలంలోని పీర్ల కొట్టాల(చావిడి) మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సోమవారం ఎమ్మెల్యే పి.సబితారెడ్డిని ముస్లిం నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో పీర్ల చావిడి, గుమ్మటం నిర్మాణం చేయడానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ సమీర్, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు హాజీ బాబా, మొహర్రం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జలాలుద్దీన్, సభ్యులు హబీబుద్దీన్, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం సమీపం నుంచి పడకల్‌గేట్ వరకు రూ.14.60 కోట్లతో 9.2 కిలోమీటర్ల మేరకు నిర్మించనున్న బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తండాలు, మారుమూల పల్లెలకు రహదారుల ఏర్పాటుతో పాటు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన సాగుతుందన్నారు. త్వరలోనే రైతులకు రూ.2 లక్షల పంట రుణాలను ప్రభు త్వం మాఫీ చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ సీతరామయ్య, ఏఈ విజయ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీను, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాములుగౌడ్, యాదగిరిరెడ్డి, వేణుగోపాల్, చందోజీ, అశోక్, తిరుపతిరెడ్డి, ఇక్బాల్‌పాషా, శంకర్‌నాయక్, జహంగీర్‌అలీ, శేఖర్‌గౌడ్, లక్ష్మయ్య, షాబుద్దీన్, ప్రభు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలకు బాసట

కడ్తాల్: మండలంలోని సలార్‌పూర్ గ్రామానికి చెందిన కర్రె ఎల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ సోమవారం రూ.ఐదు వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి, మాజీ ఎంపీటీసీ ప్రియారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**

తలకొండపల్లి: మండలంలోని జంగారెడ్డిపల్లికి చెందిన మహేశ్(26) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్‌లు బాధిత కుటుంబానికి వరుసగా రూ.మూడు, రూ.రెండు వేల నగదును అందజేశారు.

### అర్హులు దరఖాస్తు చేసుకోండి

**ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి**

యాచారం: ఆరు గ్యారంటీల్లో భాగంగా విద్యుత్ జీరో బిల్లులు, గృహలక్ష్మి తదితర పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 గ్రామాల నుంచి నేటి వరకు 720 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అర్హులైన పేదలు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక సిబ్బంది వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డుతో పాటు అన్ని ధ్రువపత్రాలు అందజేయాలని పేర్కొన్నారు.

### బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లకు సత్కారం

ఆమనగల్లు: స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రఘునాయక్ కడ్తాల్ పోలీసుస్టేషన్‌కు, శ్రీశైలం కేశంపేట ఠాణాకు బదిలీ అయ్యా రు. ఈ మేరకు పోలీసుస్టేషన్ ఆవరణలో సోమ వారం జరిగిన వీడ్కోలు సమావేశంలో కానిస్టేబుళ్లను ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఏఎస్ఐలు యాద య్య, బాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

### 'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఇబ్రహీంపట్నం: రైతులను మరోసారి రేవంత్ రెడ్డి సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్ నేత, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు రుణమాఫీకి రేషన్‌కార్డు తప్పనిసరి అనడం మోసం చేయడమేనన్నారు. రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటే చాలామంది రైతులు రుణమాఫీకి అనర్హులౌతారన్నారు.

# అభివృద్ధికి సహకరించాలని నేతల వినతి



ఎంపీ మల్లురవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవిని సోమవారం కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు ఆధ్వర్యంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, మల్లేశ్, రాఘవేందర్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### గ్రామీణ క్రీడాకారులకు చేయూతనివ్వండి



పుల్లెల గోపీచంద్‌తో లక్ష్మీనివాస్

తలకొండపల్లి: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ)రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీశ్రీనివాస్ సోమవారం భారత బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్‌ను కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా.. శిక్షణ శిబిరాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.



## కర్ర విరిగిందా.. అంతే!

అసలే వర్షాకాలం.. రెండు మూడు రోజులుగా వరుణుడు జోరుగా కురుస్తున్నాడు. ఇలాంటి సమయంలో విద్యుత్ నిరంతర సరఫరా కోసం అధికారులు అప్రమత్తంగా ఉండాలి. మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో ప్రమాదానికి సూచికగా ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోంది. ఓ వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు అమర్చే ఇనుప కడ్డీకి బదులుగా తాటి కర్రను బిగించారు. దీంతో ఎడతెరపి లేని వర్షాలకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

– మంచాల